స్థాపితం : 1930
LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి




# జమీన్‌రైతు




సంపుటి : 79 సంచిక 15 11-4-2008 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-

# చిరు చెలగాటంతో ప్రాణ సంకటం!

చిరంజీవి రాజకీయ ప్రవేశం మీద మళ్లీ ఆశలు చిగురించాయి. బ్లడ్ బ్యాంకు దశమ వార్షికోత్సవం పేరుతో పత్రికల వారిని పిలిచి, త్వరలో విడుదల అనే ప్రకటన చేశాడు అల్లు అరవింద్. దానితో అన్ని రాజకీయ పార్టీలూ ఉలిక్కి పడ్డాయి. చిరంజీవి రాజకీయాలలోకి రాడేమోనన్న అనుమానాలను ఈ ప్రకటన నివృత్తి చేసింది. ఆయన రాక ఖాయమని తేలిపోయింది. చిరంజీవిని అడగకుండా, అనుమతి లేకుండా ఆ ప్రకటన చేయలేదు కదా అల్లు అరవింద్?

మొత్తం మీద చిరంజీవి రాజకీయ క్రీడ పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా నడుస్తున్నది. ఆయన రాజకీయాలలోకి రావడం అంటూ జరిగితే, రేపటి ఎన్నికలు ఏ తీరులో వుంటాయో వూహించడం కష్టం. ఏ పార్టీకి కూడా గెలుపు ధైర్యం వుండదు. ఏ అభ్యర్థి కూడా ఆత్మ విశ్వాసం నిలుపుకోలేదు. అంతా చిందర వందరగా మారి పోతుంది. చీకాకు మయమౌతుంది. కాంగ్రెస్, తెలుగు దేశంలు రెండూ గందరగోళంలో పడి



పోతాయి. వలసల ప్రమాదం ఎదుర్కొంటాయి. సిపిఎం, సిపిఐ, బిజెపిలకు ఎటు పోవాలో, ఎవరితో కలవాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్లనే రెండు నెలల్లో చిరంజీవి రాజకీయ ప్రవేశం జరగవచ్చునని అల్లు అరవింద్ చేసిన ప్రకటన అంత సంచలనం సృష్టించింది.

చిరంజీవి వల్ల ఎక్కువగా నష్టపోయేది ఎవరనే చర్చ విస్తృతంగా వుంది రాజకీయవర్గాలలో. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మీద ప్రజాభిమానం పెల్లుబుకున్నది కాబట్టి, చిరంజీవి టిడిపి ఓట్లను మాత్రమే చీలుస్తాడని ఒక వాదన. గత ఎన్నికలలో కాంగ్రెస్‌కు అనూహిత ఆధిక్యత తెచ్చి పెట్టిన తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలు నాలుగూ ఆ పార్టీని చావుదెబ్బ తీయడం ఖాయమని మరొక వాదన. ఈ నాలుగు జిల్లాలలో కాపు కుల జనాభా అత్యధికం కావడం,

తరువాత 14వ పేజీలో

## తెలుగుదేశం పాలిట శాపం

తెలుగుదేశం పాలిట శాపంగా పరిణమిస్తున్నది తెలంగాణా వివాదం. దానికి సై అంటే కోస్తాంధ్ర వాసులకు కోపం; నై అంటే తెలంగాణా వాదులకు కష్టం. ఈ నిప్పు రాజేసింది దేవేంద్ర గౌడ్. దాన్ని ఎగదోసింది కడియం శ్రీహరి. నిజానికి దేవేంద్రగౌడ్ రాజకీయం ముడిపడి వున్న రంగారెడ్డి జిల్లాలో తెలంగాణా వాదం వూసే లేదు. అయినా ఆయన దాన్ని పట్టుకుని వేళ్లాడుతున్నాడంటే, తెలంగాణా మీద ప్రేమ కంటే, జీవిత కాలం కో పైలట్‌గా వుండడం ఇష్టం లేకనే అని అందరికీ తెలుసు. రెండు రాష్ట్రాలుగా విడిపడితే, ఒకదానికి తాను ముఖ్యమంత్రి కావచ్చునని ఆశ. అయితే తెలంగాణాకే చెందిన నాగం జనార్దనరెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డి వంటి వారు మాత్రం సమైక్య నినాదానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రకాశం జిల్లాకు చెందిన గరటయ్య, గుంటూరు నేత కోడెల శివప్రసాద్, గోదావరి జిల్లా నాయకుడు యనమల రామకృష్ణుడు మాత్రం ఎట్టి పరిస్థితులలో వేర్పాటు ఉద్యమాన్ని సమర్థించడానికి లేదని మొండిగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్‌లో ఈ విషయంపై ఎన్ని వాద ప్రతివాదనలున్నా ముఖ్యమంత్రి వైఎస్ మాత్రం సమైక్యత కోరుకొంటున్నారని; తెలుగుదేశం వూగిసలాటకు లోనైతే సమైక్యత నినాదానికి వైఎస్ ప్రతీకగా మారుతాడని; అది టిడిపికి ఆత్మహత్యా సదృశ్యమని కోస్తా జిల్లా వాసుల భావన.

రెండు ప్రాంతాల నేతలలో వ్యక్తమౌతున్న పట్టుదల, పంతాలు చంద్రబాబుకు తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి. 2004 ఎన్నికలలో ఆయన తెలంగాణా మీద స్థిర చిత్తం ప్రదర్శించారు. ఎంత వత్తిడి వచ్చినా నిలబడ్డారు. అయితే ఇటీవలకొంత కాలంగా వూగిసలాట ధోరణి ప్రదర్శిస్తున్నారు. తెలంగాణాకు ఒప్పుకొంటే ఎట్లా వుంటుందని తనకు నమ్మిన బంట్ల వంటి పాత్రికేయులతో చర్చ కూడా చేశాడు. కానీ అప్పట్లో తెలంగాణా ఇస్తే పోలేదా అన్న వారు కూడా ఇప్పుడు వద్దు అని గట్టిగా చెప్పడంతో, ఎటు తేల్చుకోవాలో ఆయనకు పాలు పోవ

తరువాత 14వ పేజీలో






### సైకిల్ యాత్రతో చంద్రమోహన్‌రెడ్డికి...

# కాళ్ల నొప్పి... ఒంటికి అలుపు... జేబుకు చిల్లే మిగిలింది!

జిల్లా తెలుగుదేశం పార్టీ పునరుజ్జీవనానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చాలా ప్రయాసే పడుతున్నాడు. రాజకీయాలలో ఒక్కొక్కరి జాతకం ఒక్కొక్క రీతిలో వుంటుంది. కొంతమందికి అనాయాసంగా పదవీ భోగం వచ్చి ఒళ్లో వాలుతుంది. కొందరు మాత్రం తమ వునికి చాటుకోవడానికి ఒంటికి మించిన శ్రమ పడుతూ వుంటారు. చంద్రమోహన్‌రెడ్డి ఈ రెండో కోవకు చెందినవాడు. అసలే బక్క ప్రాణం. అయినా నిత్యం రాజకీయ పోరాటాలే. ఆదినుంచి ఆ జాతకం తీరే అంత. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిని గుడ్డిగా నమ్మి నానా యాతన పడ్డాడు. అప్పట్లో తెలుగుదేశం పార్టీలో తనపై వచ్చిన మచ్చ తుడుచుకోవడానికి మద్యపాన నిషేధోద్యమం పేరిట జిల్లా అంతా కాళ్లరిగేట్లు తిరిగాడు. మంత్రిత్వం దొరికిన తర్వాత కూడా సుఖం లేదు. స్వంత పార్టీలోనే అసమ్మతి బుస కొట్టడంతో, ఒంటరిగా మిగిలి అన్ని రకాల అవమానాలు ఎదుర్కొన్నాడు. ప్రతిపక్షంలో వున్నా ఆ ఇంటి పోరు తప్పడం లేదు. ఎక్కడికక్కడ జిల్లా స్థాయి నేతలందరూ తమ తమ నియోజకవర్గాలకు సామంతు రాజులుగా ప్రకటించుకోవడమే కాదు, చంద్రమోహన్‌రెడ్డి మీద కక్షతో ఏకంగా చంద్రబాబు మీదనే కత్తిదూసే స్థాయికి ఎదిగిపోయారు. పార్టీలో ఎవరు వుంటారో, ఎవరు జారుకొంటారో తెలియని అయోమయం. దానితో కార్యకర్తలలో నిర్లిప్తత పెరిగిపోయింది. ముల్లుగర్ర పెట్టి పొడిచినా ముందుకు కదిలే వారు లేరు. ఎన్నికల గడువు ఏడాది లోపలకు ముంచుకొస్తున్నా పార్టీ యంత్రాంగంలో మతకం వదలక పోవడంతో, కార్యకర్తలకు చురుకు పుట్టించడానికి జిల్లా మొత్తం మీద సైకిల్ యాత్ర తలపెట్టాడు చంద్రమోహన్‌రెడ్డి.

> **ఈ యాత్ర పట్ల జనం ఆసక్తి చూపలేదు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల పట్ల వున్న సానుకూలత జనంలోని నిర్లిప్తతకు కారణమని చెప్పడం అతిశయోక్తి కాదు.**

అదేమీ చిన్న ప్రయత్నం కాదు. ఉదయగిరిలో మొదలుపెట్టి సూళ్లూరు పేట వరకు, అక్కడ నుంచి మళ్లీ నెల్లూరు దాకా దాదాపు ఐదు వందల కిలోమీటర్లు ఎర్రటి ఎండలో సైకిల్ తొక్కడం మాటలు చెప్పినంత సులభం కాదు. 12 రోజులు ఏకధాటిగా తనతో పాటు, తోడుగా వచ్చే వారికి అన్నం నీళ్లు, స్నానపానాలకు ఏర్పాట్లు చేయడం ఒక భారమైతే; ఇంత పెద్ద కార్యక్రమంలో కూడా సహచరనేతలెవరూ కల్సి రాలేదన్న నిందపడకుండా చూసుకోవడం మరింత పెద్ద ప్రయాస. గడ్డాలు పట్టుకుని బ్రతిమలాడాడో లేక కాళ్లే పట్టుకుని ప్రాధేయపడ్డాడో తెలియదు కానీ తనతో ఎడముఖం పెడముఖంగా వుండిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో సహా అందరినీ సైకిల్ ఎక్కించడంలో సఫలీకృతుడైనాడు. జిల్లా స్థాయిలో పార్టీని బ్రతికించుకోవడానికి ఇంత శ్రమ, తాపత్రయం అవసరమా అన్నది ప్రశ్న. ఇంత పెద్ద వ్రతానికి తగ్గ ఫలితం ఏమిటి అన్నది ఇంకా పెద్ద ప్రశ్న.

వ్రతం చెడినా ఫలితం దక్కలేదనేది సాధారణంగా చెప్పే సామెత. కానీ చంద్రమోహన్‌రెడ్డి సైకిల్ యాత్రలో వ్రతం సాఫీగా సాగినా, ఫలితం మాత్రం శూన్యమేమో అన్పిస్తున్నది. ఏ జనం కోసం బక్క ప్రాణాన్ని కష్ట పెట్టుకున్నాడో, ఆ జనం ఈ యాత్ర పట్ల ఆసక్తి చూపలేదు. అది యాత్ర తప్పు కాకపోవచ్చు. గ్రామీణ ప్రాంతం ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల, ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల పట్ల వున్న సానుకూలత జనంలోని నిర్లిప్తతకు కారణమని చెప్పడం అతిశయోక్తి కాదు. ఒక్క అవినీతి తప్ప రాజశేఖరరెడ్డిలో చూపడానికి మరే తప్పులేదు. జనం కోరుకున్నవి మాత్రమే కాదు, కలలో కూడా ఎదురుచూడని వ్యక్తిగత ప్రయోజనాలను సైతం తెచ్చి చేతిలో పెడుతున్నాడు ముఖ్యమంత్రి. రాజకీయాలలో అవినీతి అనే అంశానికి పట్టణ ప్రాంతాలలో వుండే పట్టింపు గ్రామాలలో



సైకిల్ యాత్రను పురస్కరించుకొని అల్లూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న సోమిరెడ్డి.

తరువాయి 14వ పేజీలో





తెలుగుదేశం పిలుస్తోంది రా ! కదిలి రా !

ఉద్యమమై ఉరుకుదాం - ఉప్పెనలై సాగుదాం !

తేది 2-4-2008 నుండి 15-4-2008 వరకు



తెలుగుదేశం సైకిల్ యాత్రలు నేటి నుంచి జైత్రయాత్రగా కొనసాగుతున్నాయి.
ఈ యాత్రకు NTR అభిమానులు, శ్రీ చంద్రబాబు అభిమానులు,
శ్రీ బాలకృష్ణ అభిమానులు, శ్రీ హరికృష్ణ అభిమానులు,
శ్రీ జూనియర్ NTR అభిమానులు
పార్టీ అభిమానులు, తెలుగుదేశం పార్టీ మాజీ శాసన సభ్యులు,
మాజీ పార్లమెంట్ సభ్యులు, స్థానిక సంస్థల
ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు
అందరూ పాల్గొని జయప్రదం చేద్దాం !

ప్రతి కార్యకర్త గుండె తలుపు తడదాం ! రాబోవు ఎన్నికల
కురుక్షేత్రానికి దేశం సైనికులను సమాయత్తం చేద్దాం !



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు

# గిరిజనుల బ్రతుకులు మారవా?

సమాచార, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి దేశం పురోగతి వైపు పరుగులు తీస్తుంది. మరోప్రక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. అయినా ఇవేమి గిరిజనుల బ్రతుకుల్లో ఎలాంటి మార్పు తీసుకరాలేక పోతున్నాయి.

ఎర్రబస్సు మొఖం చూడని పలు గిరిజన గ్రామాలు జిల్లాలో నేటికీ వున్నాయంటే ఆశ్చర్యపడక తప్పదు. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులు తప్ప గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న వారు దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వ పథకాలు గానీ, ప్రభుత్వ కార్యాలయాల గురించి తెలియని గిరిజనులు లెక్కలేనంత మంది వున్నారంటే ఆశ్చర్యం కల్గకమానదు.

> జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల 50వేల మంది గిరిజనులున్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఏ పథకం వీరి దరి చేరడం లేదు. మధ్య దళారులు, అధికారులు వీరి పేరుతో పథకాల తాలూకు ప్రతిఫలాలు స్వాహా చేస్తున్నా ప్రశ్నించే ధైర్యం కూడా లేదు.

ఇప్పటికీ గిరిజనులు వుండేందుకు ఇళ్లు లేవు. మూడు పూటలా భోజనం దొరక్క అల్లాడిపోతున్నారు. స్వంత ఇల్లు, ఆస్థిపాస్తులు లేక పొలాలు, కాల్వగట్లపై వీరు నివసిస్తుండడం అందరూ చూస్తూనే వుంటారు. అయినా ఎవరు కూడా వీరి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయరు.

సమాజంలో మనిషిగా జీవిస్తున్నా ఆత్మ గౌరవం చంపుకుని గిన్నెలు చేతబట్టి శుభకార్యాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి భోజనం కోసం గిరిజనులు ఎదురుచూస్తుంటారు. అక్కడి నిర్వాహకులు వీరిని ఎంత తిట్టినా, చీదరించుకున్నా ఏమీ బాధ పడరు. ఎందుకంటే వీరికి భోజనం అవసరం కనుక. దీనినిబట్టి గిరిజనులు సమాజంలో ఎంతటి గౌరవంతో జీవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్రజా ప్రతినిధులతో పాటు ప్రభుత్వం కూడా గిరిజనుల పట్ల వివక్షత చూపుతుందనే చెప్పాలి. వీరి ఓట్లతో గద్దెనెక్కిన రాజకీయ నాయకులు గిరిజనుల అభివృద్ధి ఊసేఎత్తరు. గిరిజన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపిటిసి, జడ్పీటీసిలు పలువురు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏ సభలోగానీ, సమావేశంలో గానీ గిరిజనుల సమస్యలపై అసలు చర్చించిన దాఖలాల్లేవు.

వీరు పేరుకే ప్రజా ప్రతినిధులు. సభలు, సమావేశాల్లో మాట్లాడ లేరు. ఎందుకంటే వీరంతా ఆయా గ్రామ భూస్వాముల చెప్పుచేతుల్లో వుంటారు. భూస్వాములకు ఎదురుతిరిగి ధైర్యంగా ఏపనైనా చేస్తే తర్వాత లేనిపోని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుంది. దీంతో ఎందుకొచ్చిన తంటా అనుకుని గ్రామ భూస్వాములు చెప్పిన విధంగానే గిరిజన ప్రజా ప్రతినిధులు నడుచుకుంటారు. ఫలితంగా వీరికి ఓట్లు వేసిన గిరిజనులు అన్ని విధాలుగా మోసగింపబడుతుంటారు.

జిల్లాలో 2001 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం 2,42,257 మంది గిరిజనులు వున్నారు. వీరిలో పురుషులు 1,23,554 మంది; మహిళలు 1,18,703 మంది వున్నారు. గడిచిన ఏడు సంవత్సరాలలో మరో లక్ష మంది పెరిగి వుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గిరిజనుల జనాభా, వీరి జీవన విధానంపై సమగ్ర సర్వే చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గిరిజనులు జిల్లాలో ఎంత మంది నివసిస్తున్నారు, ఇతర ప్రాంతాలకు జీవనం కోసం ఎన్ని కుటుంబాలు వలస వెళ్లాయి అనే దానిపై సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టింది.

తిరుపతికి చెందిన "రైజ్" అనే స్వచ్ఛంద సంస్థ, వెంకటేశ్వర యూనివర్శిటీ సోషియాలజీ విద్యార్థులు సంయుక్తంగా సర్వే చేసేందుకు ఐటిడిఎతో ఒప్పందం కూడా జరిగింది. దీనికిగానూ దాదాపు రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చు అయ్యే అవకాశం వుంది. సర్వే కోసం ముందుగా 50 శాతం నిధుల్ని కూడా ఐటిడిఎ సర్వేచేసే సంస్థలకు చెల్లించింది.

ఇంతవరకు బాగానేవున్నా, సర్వే చేసేందుకు నియమించిన వారికి ఈ వ్యవహారమై పూర్తి అవగాహన లేకపోవడంతో పొరపాట్లు దొర్లే ప్రమాదం వుంది. సర్వే కోసం అనుమతి పొందిన "రైజ్" సంస్థ జిల్లాలో ఇతర స్వచ్ఛంద సంస్థలు సహకారంతో కార్యకర్తలను నియమించుకుంది.

ప్రతి గ్రామానికి వెళ్లి ప్రతి గిరిజన కుటుంబాన్ని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి నిర్ణీత దరఖాస్తులో పొందుపరచాలి. అవగాహనలేని వారిని సర్వేకు పంపడంతో వారు కుటుంబాల్ని సందర్శించకుండా వార్డు మెంబర్, స్థానిక రాజకీయ నాయకుల్ని కలిసి వారు చెప్పిన విధంగా పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

సర్వే సక్రమంగా చేపట్టకపోతే గిరిజనుల కోసం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి చేపట్టాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరకుండా పోయే అవకాశం వుంటుంది. ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలుచేస్తున్నా ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ గిరిజనుల జీవన విధానంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

తోటపల్లి గూడూరు మండలం వరిగొండ పంచాయితీ సర్పంచ్ పదవిని గిరిజనులకు రిజర్వు చేసారు. ఇదే గ్రామానికి చెందిన వ్యక్తిని సర్పంచ్‌గా ప్రజలు గెలిపించారు. పెద్దగా చదువుకోని సర్పంచ్‌ను ఆ గ్రామ అగ్రవర్ణాలు నానా విధాలుగా ఇబ్బంది పెట్టారు.



గుడిసెలు దాటి ఎదగని గిరిజన బ్రతుకులు.

చివరికి పంచాయితీ కార్యాలయం నుంచి సర్పంచ్‌ను బయటకు గెంటేసారు అగ్రవర్ణాలు. కులం పేరుతో దూషించడంతోపాటు అవమానకరంగా మాట్లాడారు. జరిగిన సంఘటనపై కుమిలిపోయిన సర్పంచ్ గిరిజన సం

తొరవ 14వ పేజీలో

## దరిద్రంగా బతుకుతున్నాం

గిరిజన కాలనీలలో నివసించే చల్లా యానాదులు చాలా దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తూ గ్రామంలో భిక్షాటన చేసుకుని జీవించాల్సిన దుస్థితి వుంది. మాకు ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ఆర్థిక సహాయం చేయలేదు. మమ్మల్ని మనుషులుగా గుర్తించి, జీవనం కోసం సహాయం చేయాలి.



వెంపరామయ్య

## ఎవరూ పట్టించుకోరు

గిరిజన కాలనీకి ఓట్లకోసం, ఏదైనా సభకు జనం కావాలంటే అందరూ వస్తారు. మిగిలినప్పుడు ఎవరు రారు. ఎవరు పట్టించుకోరు. కాలనీలో 18 మంది వుంటే 9 మందికి పక్కా ఇళ్లు కట్టించారు. మిగిలిన ఇళ్ల గురించి ఇంతవరకు సమాచారం లేదు. మా జీవితాల్లో ఎప్పుడు వెలుగు వస్తుందో ఆ దేవుడికే తెలియాలి.



బుజ్జయ్య




## బిల్లుల చెల్లింపులో జాప్యం

రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తమ బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ వాకాడు పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలు మండల పరిషత్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. వాకాడు బిసి కాలనీ, బూడిదల వాగు, సాయుబులపాళెం, కొండూరు గ్రామాల్లో సిమెంట్ బిల్లులు చెల్లించకుండా హౌసింగ్ కార్పొరేషన్ ఎఇ మధుసూ

**ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి ఇది.**

ధన్ రెడ్డి నెలల తరబడి తిప్పుకొంటున్నారని వారు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఎఇ స్వాహా చేసి వున్నాడని ఆరోపించారు. రోజూ పనులు మానుకొని అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ప్రయోజనం వుండటం లేదని వాపోయారు. తక్షణ బిల్లుల చెల్లింపు జరగని పక్షంలో ఆందోళన చేపడుతామని మహిళలు హెచ్చరించారు.




వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన ఉగాది వేడుకలలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు. వేదికపై టీపీవెంకటే, చలసాని రమేష్, దత్తాత్రేయ శాస్త్రి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కలెక్టర్ రాంగోపాల్, సాయికృష్ణ యాచేంద్ర, కృష్ణప్రసాద్, ఘంటసాల రత్నకుమార్ తదితరులున్నారు.

## ఆత్మకూరు నేతల రూటే వేరు

ఆత్మకూరు నేతల రాజకీయ విన్యాసాలు పతనావస్థకు చేరుకొంటున్నాయి. నియోజకవర్గంలోని కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపిలకు చెందిన నేతలందరిదీ ఇదే తీరు. నైతిక విలువలకు తిలోదకాలిచ్చి స్వార్థం కోసం తమను నమ్ముకొన్నవారినే బలి పశువులు చేస్తున్నారు. ఐదు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు

**అన్ని పార్టీల నేతలదీ అదే తీరు**

అవకాశం వచ్చిన సీనియర్ నేత బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి తన కుమారుడి కోసం పార్టీని గాలికి వదిలేశాడు. అంతేకాక ఎఎస్‌పేట జడ్పీటిసి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయడం విమర్శల పాల్జేసింది. ప్రస్తుత ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వెన్నుదన్నుగా నిల్చిన నరిశెట్టి శీనయ్యకు వ్యతిరేకంగా వ్యవహరించడం చర్చనీయాంశమ

తొరవ 14వ పేజీలో

# ఐరన్‌ఓర్ లారీలను నియంత్రించరెందుకు?

ఐరన్‌ఓర్ లారీల వల్ల గనుల యాజమాన్యాలకు లక్షల రూపాయల్లో ఆదాయం వస్తుంటే గ్రామాల్లోని ప్రజలు మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరగాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ వైపు నుంచి మితిమీరిన వేగంతో ప్రయాణించే ఈ లారీలు యమపాశాల్లా మారి ఎక్కడ తమ ప్రాణాలు బలిగొంటాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. బుచ్చి మండలం కాగులపాడు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఐరన్‌ఓర్ లారీ క్రిందపడి గత వారం మృత్యువాత పడ్డారు. రోజూ పనికి వెళ్లినట్లే ఏప్రెల్ 1వ తేదీన ఇటుక బట్టీల వద్ద పనికి వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వస్తుండగా వేగూరు కాలువ

**ఇంకెంతమంది ప్రాణాలు పోవాలి!**

వద్ద లారీ ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాసులు, విజయమ్మ, లక్ష్మమ్మ, కొత్త దళితవాడకు చెందిన శారమ్మ అక్కడిక్కడే మృతి చెందారు. మరో పది మంది గాయాలపాలయ్యారు. సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకొన్న ప్రజలు ఐరన్‌ఓర్ లారీ నలుగురి ప్రాణాలను కబళించిందని తెలుసుకొని ఆగ్రహోద్రగ్దులై, లారీని తగల బెట్టబోగా పోలీసులు అప్రమత్తమై స్థానికులను శాంత పరిచారు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరు పేదలు. కుటుంబ భారాన్ని మోస్తున్న వారు అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబాలు వీధినపడ్డాయి. మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఐరన్‌ఓర్ లారీల దూకుడుకు అడ్డుకట్టవేయకపోతే జిల్లాలో ఇంకెంత మంది మృత్యువాత పడతారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నెల్లూరు పొగతోటలో ప్రభవ షోరూంను ప్రారంభిస్తున్న ప్రఖ్యాత రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి. ప్రక్కన న్యాయవాది అనంతరామయ్య, డాక్టర్ శ్రీధర్, చంద్రలత వున్నారు.



కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి సుబోధ్‌కాంత్ సహాయ్ చేతుల మీదుగా దక్షిణ భారత ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నెల్లూరీయుడు మాతూరి సురేంద్రరెడ్డి.

## సీతారాంసాగర్ జపం!

వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన సీతారాంసాగర్ ప్రాజెక్టుకు ఏప్రెల్ మాసంలో శంఖుస్థాపన చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన హామీతో ఉదయగిరి నియోజక వర్గం రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. మార్చిలో జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. జిల్లా రైతాంగానికి వరదాయనిగా వున్న సోమశిల ప్రాజెక్టు నుంచి సాగునీరు అందని ఏకైక నియోజక వర్గం ఉదయగిరి. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛయైన సీతారాంసాగర్ ప్రాజెక్టును అన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయ అవసరాల కోసం దశాబ్దాల తరబడిగా ఒక అస్త్రంగా వాడుకోవడం మినహా

**ఉదయగిరి నేతల తీరిది**

ప్రాజెక్టు సాధన దిశగా చిత్తశుద్ధితో కృషి చేసిన దాఖలాలు లేవు. కమ్యూనిస్టులు సైతం ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ పరిస్థితుల్లో వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజిని పూర్తి చేయించి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిరకాల వాంఛ తీర్చిన ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, సీతారాంసాగర్ ప్రాజెక్టును త్వరలో పూర్తిచేసి రైతాంగానికి నీళ్లిస్తామని చెప్పడంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి.

## బుచ్చి ఆటోల దూకుడు

బుచ్చిరెడ్డిపాళెంలో ఆటోల దూకుడుకు కళ్లెం వేసే వారు లేకుండా పోయారు. మితిమీరిన వేగంతో తిరుగుతున్న ఆటోలు బుచ్చి వాసులను చీకాకు పెడుతున్నాయి. రెండు వేల ఆటోలు నిత్యం పట్టణంలో తిరుగుతున్నాయంటే పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా వుందో అర్థం చేసుకోవచ్చు. బుచ్చి - జొన్నవాడ - నెల్లూరు రూట్లలో 700 ఆటోలు, బుచ్చి - చెన్నూరు మార్గంలో 300 ఆటోలు, సంగం రూట్లో 500, మిగతా వివిధ మార్గాలలో మరో 500కు పైగా ఆటోలు గ్రామాలకు ప్రయాణీకులను తీసుకొని వెళ్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఆటోలో 20మందికి పైగా ఎక్కించడంతో ప్రయాణీకులు ప్రమాదాలకు

**ప్రమాద భరిత ప్రయాణం**

గురౌతున్నారు. ఆటో ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలుపోయే పరిస్థితి. దీనికితోడు అదుపులేని వేగంతో తిరుగుతూ ఆటోలు స్థానికుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ట్రాఫిక్‌ను కంట్రోలు చేయాల్సిన పోలీసులు సెటిల్‌మెంట్లు, దందకాల్లో మునిగి తేలుతూ పట్టించుకోకపోవడంతో ఆటోలదే ఇష్టారాజ్యంగా మారింది.



తెలుగుదేశం పార్టీ జిల్లాలో చేస్తున్న ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న, ఆనం వెంకటరమణారెడ్డి తదితరులు.



కుంభకోణాల కార్ఖానా ఈ ఆఫీసు.

# నకిలీ పత్రాల రాకెట్

నెల్లూరు కార్పొరేషన్‌లో కుంభకోణాలు కొత్త కాదనుకొన్నా ఎప్పటికప్పుడు బయటపడుతున్న కుంభకోణాలు కార్పొరేషన్ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. శానిటరీ శాఖలోని హెల్త్ అసిస్టెంట్లు కూడబలుకుకొని

**కార్పొరేషన్‌యే కేంద్రం**

వేలాది రూపాయలు లంచాలుగా తీసుకొని జారీచేసిన జనన, మరణ ధృవీకరణ పత్రాలు వివాదాస్పదమయ్యాయి. ఏడాది క్రిందట ముత్తుకూరుకు చెందిన ఈపూరు శేషాద్రిరెడ్డి ఇద్దరు కుమార్తెలు సునీత, సుజాతలు నెల్లూరులో పుట్టారని కార్పొరేషన్ అధికారులు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. శేషాద్రిరెడ్డికి పిల్లలే లేరని కలెక్టర్‌కు ఈ విషయమై కొందరు ఫిర్యాదు చేయగా, ఆయన వెంటనే నివేదిక పంపమని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అధిక మొత్తంలో ముడుపులు తీసుకొని ఈ సర్టిఫికేట్లు జారీచేస్తున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. విదేశాల్లో వున్న వారికి సైతం నకిలీ జనన, మరణ సర్టిఫికేట్లు జారీచేసి నెల్లూరు కార్పొరేషన్ అరుదైన రికార్డును సాధించింది. కార్పొ

తరువ 14వ పేజీలో

# ఆదర్శ ప్రాయులు ఈ ఎమ్మెల్సీలు!

ప్రజల ఓట్లతో గెలుపొంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు గద్దెనెక్కినప్పటి నుంచి దండకాలరాయుళ్లుగా, వ్యాపారాలు, మధ్యస్థాలతో కోట్లకు పడగలెత్తుతూ కుబేరులుగా మారుతున్నారు. ఈ తరుణంలో విలువలతో కూడిన రాజకీయాలుచేసే నాయకులు, ప్రజా



ప్రతినిధులు వుండాలని ఆశించడం జరగని పని అనుకొనే పరిస్థితుల్లో తాము నమ్మిన సిద్ధాంతాలకు, విలువలకే గౌరవ మర్యాదలు తీసుకొని వచ్చేలా వ్యవహరిస్తున్నారు శాసన మండలి సభ్యులు దాచూరి రామిరెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం. తూర్పు రాయలసీమ నియోజక వర్గం ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో పోటీచేసి ఘన విజయం సాధించి వీరు ప్రజా సమస్యలపై గళం ఎత్తి పెద్దల సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తూ పెద్దల సభకు ఎన్నికైన పెద్దల్లాగా హుందాగా వ్యవహరించడంతోపాటు ప్రభుత్వం శాసన మండలి సభ్యులకు ఇచ్చిన కోట్ల రూపాయల విలువైన ఇంటి స్థలాన్ని తృణప్రాయంగా తిరస్కరించి ఆదర్శ నేతలుగా మిగిలారు. రాజకీయాల్లోకి రాగానే, అందులో పదవి పొందగానే

**కోట్ల విలువ చేసే స్థలం వద్దన్న రామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం.**

భోగలాలసాలు అనుభవిస్తూ నలగని ఖద్దరు ధరించి దాంబికంగా కనిపించే నేతలున్న ఈ రోజుల్లో నిజాయితీగా, నిరాడంబరంగా ప్రజలతో మమేకం కావడం వీరిద్దరికే చెల్లింది. విద్య, వైద్యం ప్రజలందరికీ అందుబాటులో వుండాలని గట్టిగా వాదించడం, బలమైన ప్రభుత్వ పాఠశాల వ్యవస్థకు, వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, పర్మినెంట్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై రామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యంలు ప్రభుత్వాన్ని నిలదీసి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం వీరి నిబద్ధతకు, సామాజిక అంశాలపై అవగాహనకు నిదర్శనం. శాసన మండలి సభ్యులుగా ప్రభుత్వం నుంచి వచ్చే జీతాలు, అలవెన్సులను అవసరాలకు మాత్రమే



వినియోగించుకుని మిగిలిన మొత్తాన్ని జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్‌లకు జమ చేయడం వీరి నిజాయితీకి కొలమానం. భవిష్యత్తు పదవి కాలంలోనూ వీరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు నేతలకు ఆదర్శంగా వుండాలని కోరుకొంటున్నాం.

# నాది కడప... జాగ్రత్త!

ఏమనుకొంటున్నారు... నేను కడపోడ్ని... నెల్లూరు కాబట్టి వదిలేశా అదే కడప అయివుంటేనా ఒక్కొక్కరి సంగతి తేల్చేసే వాడినని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ రాజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డాట్ సెంటర్‌ను మద్రాస్ బస్టాండు వద్ద నుంచి ఎత్తివేస్తుండడంతో దీనిపై జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు ఏరువాకకు విచ్చేసి తమ అభిప్రాయాలను తెలిపారు. ఇక్కడైతే అందరికీ అందుబాటులో వుంది. వున్నట్లుండి మారిస్తే దూరం అయిపోతుందని చెప్పారు. దీంతో రాజారెడ్డికి కోపం ఒక్కసారిగా కట్టలు తెంచుకొంది. ఏంది మీరు మీ వైపే

**రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్త హెచ్చరిక**

మాట్లాడుతారు, ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేవు, బాత్రూంలు లేవు; మహిళా ఉద్యోగినులు ఇబ్బంది పడుతున్నారు. దుర్గంధం వెదజల్లే ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించకుండా మళ్లీ దబాయిస్తారే... మీ నాయకులకు చెప్పి సౌకర్యాలను కల్పించండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రైతులు మిన్నకుండిపోయారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల దృష్టికి డాట్ సెంటర్‌లోని సమస్యలు తీసుకెళ్లకుండా రాజారెడ్డి నోరుచచ్చిన రైతులపై కడప దాష్టీకం ప్రదర్శించడం న్యాయమా?

# అబలలతో వ్యాపారం ఆగదా?

నెల్లూరులో చాప క్రింద నీరులా వ్యభిచారం విస్తరిల్లుతుంది. కష్టపడకుండానే కాసులు కురుస్తుండడంతో బాగా చదువుకొన్న యువకులు సైతం ఈ వ్యాపారం పట్ల మొగ్గు చూపిస్తున్నారు. పేదరికం, ఆడంబరాల మోజులో అమాయకులైన అబలలు ఈ వలలో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకొంటున్నారు. అడపాదడపా పోలీసులు చేస్తున్న దాడులు, చర్యలు వ్యభిచారాన్ని అడ్డుకట్ట వేయలేక పోతున్నాయి. నగరంలో రకరకాలుగా వ్యభిచారం జరుగుతుంది. నెల్లూరు నుంచి కొంత మంది అమ్మాయిలను, మహిళలను ముంబాయికి తరలించబోతూ రాధాబాయ్ అనే మహిళ పోలీసులకు పట్టుపడింది. మూడవ నగర పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఈ రాకెట్‌ను కొంతవరకు వెలుగులోనికి తీసుకొచ్చారు. ప్రేమను అడ్డం పెట్టుకొని కొందరు యువకులు బ్రోకర్ల అవతారం ఎత్తుతున్నారు. అమాయక యువతులను వీరు ఈ నరక కూపంలో దించుతున్నారు. ఇటీవల నగరంలో పట్టుబడ్డ రీనా - రామకృష్ణల కథ ఇటువంటిదే.

**రకరకాలుగా జరుగుతుంది**

ఎంటెక్ చదివిన రామకృష్ణ శ్రమ లేకుండా ఎక్కువ డబ్బు వస్తుండడంతో ఈ వృత్తిలోకి అడుగుపెట్టాడు. రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాలను పోలీసులు రెండుసార్లు పట్టుకొన్నారు. కొందరు 15ఏళ్లలోపు బాలికలను ఈ వృత్తిలోకి దించుతున్నారు. కొంతమంది అధ్యాపకులు గురుశిష్య సంబంధాన్ని కాలరాస్తూ విద్యార్థినులను ప్రలోభపెట్టి ఈ రొంపిలోనికి దించుతున్నారు. డికెడబ్ల్యు కాలేజి ఫిజికల్ డైరక్టర్ చేసిందీ ఇటువంటి నిర్వాకమే. గుట్టుగా జరిగే హైటెక్ వ్యభిచారం పై కూడా పోలీసులు పంజా విసర లేకున్నారు. మొత్తం మీద అబలలే ఆధారంగా సాగుతున్న ఈ వ్యభిచారాన్ని అరి కట్టడం కష్టం కాకున్నా నీతి నిజాయితీలతో పనిచేసే పోలీసు అధికారుల కొరత, కొన్నిచోట్ల చోటా నాయకుల ప్రాపకం వల్ల ఈ వ్యాపారం దినదిన ప్రవర్ధమానమవుతుంది.




**శ్రీసాయి బాబా వారి జన్మదిన శ్రీరామనవమి ఉత్సవములు**

తేది 14-4-2008 సోమవారం నుండి 16-4-2008 బుధవారం వరకు

ప్రతిరోజు ఉ॥ గం॥ 7-00 ల నుండి శ్రీ బాబావారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనగోరు భక్తులు మందిర గుమస్తా వద్ద 50/- రూ చెల్లించి పై పూజలలో పాల్గొని బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

పై దినములలో సాయంత్రం గం॥ 7-00 ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు కలవు.

గమనిక : ప్రతిరోజు షిర్డి హారతులు జరుగును.

కార్యవర్గము

**శ్రీ షిర్డి సాయిబాబా మందిరము**

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్ : 2327771







## వైవిధ్యంగా ఫర్జానా...

తెలుగు పరిశ్రమలో నిలుదొక్కుకోను హీరోయిన్ ఫర్జానా నానాపాట్లు పడుతుంది. ఈ మధ్య కాలంలో ఈమె హీరోయిన్‌గా నటించిన భాగ్యలక్ష్మి బంపర్ డ్రా, సీమశాస్త్రి చిత్రాలు ఓ మోస్తరుగా ఆడాయి. దీంతో ఎలాగైనా హిట్ సాధించాలన్న తపన ఫర్జానాలో మొదలయ్యింది. గతంలో యోగా టీచర్, కొరియా గ్రాఫర్ కూడా అయిన ఫర్జానా ప్రస్తుతం 'బొమ్మనా బ్రదర్స్... చందన సిస్టర్స్' చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో తాను వైవిధ్యభరితమైన పాత్రలో కనిపించానని; తెలుగు ప్రేక్షకులు తనను ఆదరిస్తారంటుంది.

## మల్లె తీగలా కరీనా

బాలీవుడ్ అందగత్తె కరీనాకపూర్ పవర్ యోగా డైట్ చేసి మల్లెతీగలా మారింది. మల్లె తీగలా మారను కరీనా బాగా కష్టపడిందట. తనకిష్టమైన మాంసం, పాల ఉత్పత్తుల తోపాటు రొయ్యలు, పీతలు కూడా తినడం మానేసిందట. ఆరెంజ్ జూస్ మాత్రమే తాగుతూ బాడీని షేప్‌కు తెచ్చుకొందట. విపరీతంగా డైటింగ్ చేయడంతో ఒకసారి సెట్లోనే కళ్లు తిరిగి పడిపోయిందట. కరీనా డైటింగ్ గూర్చి తెలుసుకొన్న ఆమె తండ్రి ఆందోళన చెందాడు. కరీనా సన్నబడటం ద్వారా ఆమె అసలు సిసలు అందాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయని డిజైనర్లు అంటున్నారు. రాబోయే సినిమాల్లో కరీనా సరికొత్త అందాలతో దర్శనమిస్తుందనవచ్చు.

## త్రిష మంచి మనసు

తెలుగు, తమిళ పరిశ్రమల్లో బిజీగా వున్న నటి త్రిషకు స్వభావరీత్యా కోపం ఎక్కువేనని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతుంటాయి. అయితే కొన్ని విషయాల్లో కరుకుదనం చూపించే త్రిషలో మనుషుల్ని ఎంతగానో అభిమానించే గుణం కూడా వుంది. ఆమె తనకు అత్యంత సన్నిహితులైన వారికి ఎటువంటిలోటు కలగకుండా చూసుకుంటుందట. తన వ్యక్తిగత సిబ్బందిని చూసుకొనే విషయాల్లో కూడా ఆమె అత్యంత జాగ్రత్తగా వుంటుందట. వారికి ఎలాంటి లోటు జరగకుండా తనతో సమానంగా వారిని చూసుకొంటుందట త్రిష. తాను ఎక్కడికి వెళ్లినా వారి గూర్చి ప్రత్యేకంగా అడిగి తెలుసుకుంటుందట ఈ అందాల నటి. దీనివల్ల త్రిష పట్ల ఆమె అసిస్టెంట్లు ఎంతో అభిమానాన్ని వ్యక్తం చేస్తుంటారు.

## ప్రియాంక ఆనందం!



బాలీవుడ్ సుందరి ప్రియాంకచోప్రా కొత్త ఇల్లు కట్టుకుంది. కానీ ఆ ఇంట్లోకి వెళ్లేందుకు ఆమెకు టైమ్ దొరకడం లేదు. ఈ విషయమై మాట్లాడుతూ ఇటీవలే నా డ్రీమ్ హోమ్ నిర్మాణం పూర్తయ్యింది. అయితే నా బిజీ షెడ్యూల్స్‌తో నేను అందులోకి షిఫ్ట్ అవుదామంటే టైమ్ దొరకడం లేదు. నేను మియామి నుంచి తిరిగి వచ్చిన తర్వాత అంటే జూలైలోనే ఆ ఇంట్లోకి వెళ్లొచ్చు అని ప్రియాంక బాధ పడుతూ చెప్పింది. ఈ ఇంటి నిర్మాణానికి హృతిక్ రోషన్ భార్య సుజానేరోషన్ చాలా సహకరించిందట. ప్రస్తుతం మధుర్‌భండార్కర్ 'ఫ్యాషన్'లో నటిస్తున్న ప్రియాంకచోప్రా మరోవైపు కరణ్ జోహర్ 'దోస్తానా'లో హీరోయిన్‌గా చేస్తోంది. ఈ రెండు సినిమాలు పూర్తయిన తర్వాతే తనకు కాస్త సమయం చిక్కుతుందని అప్పుడే కొత్త ఇంట్లోకి వెళ్తానంటుంది.





## ఛార్మి నరేష్‌ల గొడవ

బాపు దర్శకత్వం వహించిన సుందరకాండ చిత్రంలో నరేష్, ఛార్మి కలసి నటించారు. ఈ చిత్రం షూటింగ్ సమయంలో వీరు ఎంతో స్నేహపూర్వకంగా మెలిగినప్పటికీ ఆ తర్వాత వారి మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయట. అయితే ఈ వివాదాల వెనుక కారణాలు ఎవరికీ అంతు చిక్కడం లేదు. వీరి మధ్య వివాదాల కారణంగానే ఛార్మి నరేష్‌తో మరొక చిత్రంలో నటించే అవకాశాన్ని వదలుకుందట. సెట్స్‌లో అందరితో కలివిడిగా వుండే వీరి మధ్య గొడవకు కారణం తెలియక యూనిట్ సభ్యులందరూ తలలు పట్టుకొంటున్నారు.

No. PLG / NL / 9 - 8 / 06
11-4-2008

# దేముడా... మా పార్టీని ఓడించు!

పిసిసి అధ్యక్షత వంటి ఉన్నత స్థానంలో వుండేవారు ఎన్నికలలో పార్టీ గెలవాలని కోరుకొంటారు. తన పెత్తనంలో విజయం సిద్ధిస్తే ప్రతిష్ఠ పెరుగుతుందని భావిస్తారు. కానీ కొత్తగా ఆ స్థానంలోకి వచ్చిన డి.శ్రీనివాస్ మాత్రం,

**ఎన్నికల్లో కాంగ్రెస్ నూరు సీట్ల కంటే తక్కువ స్థితికి దిగజారి టిఆర్ఎస్ వంటి పార్టీల మద్దతు వుంటే తప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడితే ఓటమికి జవాబుదారీగా వైఎస్‌ను పక్కకు తప్పించి, తాను ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించవచ్చునన్నది డిఎస్ ఆశ అట.**

దేముడా మా పార్టీకి ఓటమి వరమివ్వు, అని వేడుకొంటున్నాడని గాంధీభవన్‌లో గుసగుసలు విన్పిస్తున్నాయి. రేపటి ఎన్నికలలో పూర్తి మెజార్టీ వచ్చినా, కొద్దిగా తగ్గినా, వైఎస్ మళ్లీ ముఖ్యమంత్రి కాకుండా అడ్డగించే వారుండరు. రాజకీయంగా, ఆర్థికంగా ఆయనకున్న బలం అంత విస్తారమైనది. పాతిక ముప్పై సీట్లు తగ్గినా, ఎమ్మెల్యేలు ఊహించని ధర చెల్లించి లోటు పూరించడానికి ఇతర పార్టీల వారు పోటీలు పడి వచ్చే పరిస్థితి కల్పిస్తాడు. అందువల్ల కాంగ్రెస్ నూరు సీట్ల కంటే తక్కువ స్థితికి దిగజారి టిఆర్ఎస్ వంటి పార్టీల మద్దతు వుంటే తప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడితే ఓటమికి జవాబుదారీగా వైఎస్‌ను పక్కకు తప్పించి, తాను ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించవచ్చునన్నది డిఎస్ ఆశ అట.

ఎవరి వూహకూ అందకుండా పిసిసి పదవి తెచ్చుకున్నప్పటి నుంచీ డిఎస్ మీద కాంగ్రెస్ వర్గాలలో పలు రకాల వ్యాఖ్యానాలు విన్పడుతున్నాయి. కొందరు సీనియర్‌నేతలు కూడా ఆయన్ను క్యాష్ అండ్ క్యారీ అని ఎగతాళి చేస్తున్నారు. రేపటి ఎన్నికలలో డబ్బున్న వాడికే టిక్కెట్ అనే సూత్రం అమలు చేస్తారని బహిరంగంగా మాట్లాడుతున్నారు. అయితే డిఎస్ మాత్రం వీటి వేటినీ పట్టించుకోవడం లేదు. గాంధీభవన్‌లో తన స్థానం సుస్థిరం చేసుకోవడానికి చాలా జాగ్రత్తగా పావులు కదుపుతున్నారాయన. పిసిసి ఇవ్వబోయే ముందు ఆయన నుంచి అధిష్టానం రెండు హామీలు తీసుకున్నదట. అందరినీ కలుపుకపోవడం, వైఎస్‌తో పేచీ లేకుండా వ్యవహరించడం ఆ హామీల సారాంశం.

అయితే పిసిసి అధ్యక్షుడిగా తన ఢిల్లీ పర్యటనలోనే ఇందుకు విరుద్ధంగా వ్యవహరించాడు డిఎస్. ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల యజమాని గాలి జనార్ధనరెడ్డి కర్ణాటకలో బిజెపి గెలుపు కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాడని అధిష్టానానికి ఫిర్యాదు చేశాడు డిఎస్. గాలికి, వైఎస్ తనయుడు జగన్‌కు వ్యాపార సంబంధాలున్న సంగతి ఢిల్లీ పెద్దలకు కూడా తెలుసు. బళ్లారి ప్రాంతంలో పాతిక ముప్పై ఎమ్మెల్యే సీట్లపై ఆయన కుటుంబ ఆర్థిక ప్రభావం వున్న మాట నిజం. అయితే గాలి తనే ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యంతో బిజెపికి వందల కోట్లు పెట్టుబడి పెడుతున్నాడని కర్ణాటక కాంగ్రెస్‌వాదుల ద్వారా డిఎస్ చెప్పించాడట. అది వైఎస్‌ను ఇరకాటంలో పెట్టే ఫిర్యాదు. నిజంగానే ముఖ్యమంత్రి కావాలన్న కోరిక వుంటే, వైఎస్ చెప్పినా గాలి వినడు. అది నిజం కాకుంటే వైఎస్ చెప్పవల్సిన అవసరమే రాదు.

ఢిల్లీలో డిఎస్ తమ కాళ్ల క్రింద కుంపటి వెలిగిస్తున్నాడన్న అనుమానం వైఎస్ శిబిరంలో దృఢంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన ఏమి చేసినా అనుమానంతో చూడక తప్పడం లేదు. అక్కడ నుంచి పుట్టిందే, దేముడా మా పార్టీని ఓడించు అని డిఎస్ మొక్కుకొంటున్నాడన్న ప్రచారం.

అయితే డిఎస్ ఏ మంత్రం వేశాడో తెలియదు కానీ, ఆయన నియామక ప్రకటన వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ సీనియర్ల గొంతులు మూగపోయాయి. అప్పటివరకు తెలంగాణా పేరుతో నానా యాగీ చేస్తుండిన వారంతా ఆ తర్వాత ఒక్క ప్రకటన ఇవ్వడానికీ ఇష్టపడడం లేదు. దాని వల్ల వైఎస్‌కు కొంత మేర మనశ్శాంతి కల్గుతున్న మాట నిజం. తమకు ఇష్టం వున్నా లేకపోయినా ఎన్నికల వరకు



డిఎస్‌తో కల్సి కాపురం చేయక తప్పదు ముఖ్యమంత్రి వర్గానికి. అందువల్ల డిఎస్‌తో ప్రత్యక్ష పోరుకు వారు సిద్ధంగా లేరు. ఆయన్ను మచ్చిక చేసుకోవడానికే ప్రయత్నం చేస్తున్నారు వారు. క్యాష్ అండ్ క్యారీ అనే సూత్రం టిక్కెట్లకే కాదు, పేచీలకూ వర్తిస్తుంది కదా? ఆ విద్యలో ఆరి తేరిన కెవిపి రంగంలోకి దిగితే, డిఎస్ వంటి వారిని బుజ్జగించడం ఎంత సేపు చెప్పండి?




Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.